
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

అమరావతి: మండల పరిధిలోని మల్లాది సమీపంలో గురువారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను అమరావతి పోలీసులు సీజ్ చేశారు.



కానుకలు లెక్కింపు

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం 4 నెలల హుండీ ఆదాయం రూ. 37,713 వచ్చినట్లు తెలిపారు.



పిడుగురాళ్లలో భారీ వర్షం

పిడుగురాళ్ల: పట్టణంలో గురువారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ కాయగా.. సాయంత్రం 5 గంటలకు వర్షం పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

తమ్ముళ్ల కిక్ వార్!

మద్యం షాపుల ఏర్పాటు వ్యవహారం అధికార పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య సంపాదన పోరుకు ఆజ్యం పోసింది. బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వర్గాల మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయి. ఇరువర్గాలు అమీతుమీకి సిద్ధపడే పరిస్థితి వచ్చింది. ఈ గొడవ ఎంపీ, ఎమ్మెల్యే మధ్యే కాక వారి అనుచరులుగా ఉన్న సామాజికవర్గాల మధ్య కూడా విభేదాలను పెంచింది. తమ లక్ష్యం ప్రజా సేవ కాదని, కాసుల సంపాదనేనని మరోమారు ఇద్దరు ప్రజాప్రతినిధులు పరోక్షంగా చాటిచెబుతున్నారు.



- పచ్చ పార్టీలో కాసుల కోసం షాపుల రగడ
- పోటాపోటీగా మద్యం దుకాణాలు ఏర్పాటు
- పక్కపక్కనే ఎంపీ, ఎమ్మెల్యే వర్గీయుల తిష్ట
- ఒక్కసారిగా రోడ్డున పడ్డ ఇరు వర్గాల విభేదాలు
- ఆది నుంచి ఎంపీని వ్యతిరేకిస్తున్న బాపట్ల ఎమ్మెల్యే
- వర్మ తీరుపై మండిపడుతున్న కృష్ణప్రసాద్ వర్గం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల పట్టణానికి చెందిన చంద్రబాబు సామాజికవర్గం నేత డి. రామ్మోహన రావు ఇటీవల జరిగిన మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియలో పాల్గొన్నారు. పట్టణంలోని 4వ నెంబర్ మద్యం దుకాణం ఆయన పేరున లాటరీలో వచ్చింది. దీంతో స్థానిక కూరగాయల మార్కెట్ ప్రాంతంలో గతంలో ఉన్న మద్యం దుకాణంలో షాపు ఏర్పాటు చేశారు. మరోవైపు బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ సమీప బంధువు ,పిట్టలవానిపాలెంకు చెందిన యుధిష్టర్‌వర్మకు బాపట్ల పట్టణంలో 6వ నెంబర్ మద్యం షాపు లాటరీలో వచ్చింది. డి.రామ్మోహన్‌రావు ఏర్పాటు చేసుకున్న మద్యం దుకాణం పక్కనే ఉన్న రూములో కొత్తగా ఈయన ప్రారంభించేశారు. పచ్చ పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే అనుచరులు దుకాణాలను పక్కపక్కనే పోటీగా పెట్టడం ఇప్పుడు బాపట్లతో పాటు జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.



షాపు నెంబర్ 4 ఆనుకొని షాపు నెంబర్ 6 యుధిష్టర్ వర్మ ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

మరోవైపు ఎమ్మెల్యే ఆది నుంచి వ్యతిరేకిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్‌కు రామ్మోహనరావు అనుకూలంగా ఉన్నాడన్న అక్కసుతో ఎమ్మెల్యే సామాజికవర్గం ఆయనపై ఆగ్రహంతో ఉంది. ఈ నేపథ్యంలో రామ్మోహనరావుకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే వర్గం మద్యం దుకాణాన్ని పోటాపోటీగా నెలకొల్పిందన్నది ఎమ్మెల్యే వర్గీయుల వాదనగా ఉంది. కృష్ణప్రసాద్‌ను చంద్రబాబు బాపట్ల ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి నరేంద్రవర్మ ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరిగింది. కృష్ణప్రసాద్ ఎంపీ అయ్యాక వారి మధ్య విభేదాలు పెరిగాయి. కొంతమంది అధికారుల బదిలీల్లో ఎంపీ జోక్యం చేసుకొని ఉన్నతాధికారులకు లేఖలు ఇవ్వడంపై నరేంద్రవర్మ తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. ఎంపీలకు ఢిల్లీలో తప్ప రాష్ట్రంలో ప్రమేయం ఉండకూడదని నరేంద్రవర్మ వాదించినట్లు పార్టీలో ప్రచారం ఉంది. బాపట్ల రియల్ ఎస్టేట్ వివాదంలో ఎంపీ జోక్యం చేసుకోవడాన్ని కూడా ఎమ్మెల్యే వర్మ తీవ్రంగా వ్యతిరేకించారు. 'నా నియోజకవర్గంలో మీ జోక్యం తగదని' నేరుగా ఎంపీని నిలదీసినట్లు అధికార పార్టీలో ప్రచారం జరిగింది. ఈ విషయాలపై ఎమ్మెల్యేపై ఎంపీ పలు దఫాలు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు ఫిర్యాదు చేశారు. అందుకు ప్రతిగా ఎమ్మెల్యే సైతం ఎంపీపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మొత్తంగా ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. వీరి గొడవతో ఆయన అనుచరుల మధ్య వర్గ విభేదాలు తారస్థాయికి చేరాయి.



రామ్మోహనరావు ఏర్పాటు చేసిన దుకాణం

'సామాజిక' పోరు

ఎంపీ అనుచరుడు తొలుత ఏర్పాటు చేసుకున్న దుకాణం పక్కనే ఎమ్మెల్యే సమీప బంధువు మద్యం దుకాణం పెట్టడం వివాదంగా మారింది. ఈ వ్యవహారం ఎంపీ, ఎమ్మెల్యే వర్గాల మధ్య మరింత ఆజ్యం పోసింది. రామ్మోహనరావు పేరుకు ఎంపీ మద్దతుదారుడుగా ఉన్నా ఆయన చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన వ్యక్తి. యుధిష్టర్‌వర్మ .. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సామాజికవర్గానికి చెందడంతోపాటు ఆయనకు సమీప బంధువు కూడా . ఈ పరిస్థితిలో రామ్మోహన్‌రావు మద్యం దుకాణం ఏర్పాటు చేసుకున్న తర్వాత ఎమ్మెల్యే బంధువునన్న దర్పంతో యుధిష్టర్ వర్మ ఇలా షాపు ఏర్పాటు చేయడంపై నియోజకవర్గంలోని చంద్రబాబు సామాజికవర్గం ఆగ్రహంతో రగిలిపోతోంది. మా ఓట్లతో ఎమ్మెల్యే అయిన వ్యక్తి మా సామాజికవర్గం వ్యక్తికి వ్యతిరేకంగా ఎలా వ్యవహరిస్తారని మండిపడుతోంది.

గతంలో మద్యం షాపుల కేటాయింపు సమయంలోనే అర్బన్, రూరల్ పరిధిలో ఏ ఏ గజిట్ నెంబర్ల దుకాణాలు ఏ ప్రాంతాల్లో పెట్టాలో నిర్ణయించేవారు. తాజాగా కూటమి ప్రభుత్వం నిర్వహించిన మద్యం పాలసీ లోపభూయిష్టంగా ఉంది. ఏ దుకాణం ఎక్కడ పెట్టుకోవాలో లోకేషన్ చూపించకపోవడంతో నిత్యం రద్దీగా ఉండి... సేల్స్ అధికంగానే జరిగే షాపులపై ఎమ్మెల్యే వర్గీయులు కన్నేశారు. అప్పటికే ఆయా లోకేషన్లలో దుకాణాలను ఏర్పాటు చేసుకున్న వారిని సదరు ప్రాంతం తమదని, వేరేచోట దుకాణం ఏర్పాటు చేసుకోవాలంటూ బెదిరిస్తున్నారు. మాట వినకుండా దుకాణం కొనసాగిస్తున్న వారి పక్కనే ఎమ్మెల్యే వర్గీయులు మరో దుకాణం ఏర్పాటు చేసి బెదిరింపుల పర్వానికి తెరతీశారు. ఈ వ్యవహారం అధికారపార్టీలో వర్గ విభేదాలను పతాకస్థాయికి చేర్చింది.

చెత్త సంపద కేంద్రాలకు భూమిని సేకరించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల: మున్సిపాలిటీలలో చెత్త సంపద కేంద్రాలకు అవసరమైన భూమిని అధికారులు సేకరించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. చెత్త సంపద కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కేంద్రాలు ఏర్పాటుతో కాలుష్యాన్ని నియంత్రించగలమని తెలిపారు. జిల్లాలోని నాలుగు పట్టణాలలో 9 ప్లాంట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బాపట్ల, చీరాల మున్సిపాలిటీలలో ఒక్కొక్క ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమి ఉందని చెప్పారు. మిగిలిన ఏడు కేంద్రాలకు 14.82 ఎకరాల భూమి అవసరమన్నారు. బాపట్ల పట్టణంలో రెండు ప్లాంట్లకు 3.50 ఎకరాల భూమిని సేకరించాలన్నారు. చీరాల పట్టణంలో ఒకటి ఏర్పాటుకు రెండు ఎకరాలు, రేపల్లెలో రెండు ప్లాంట్లకు 4.89 ఎకరాలు, అద్దంకిలో రెండు ప్లాంట్లకు 4.50 ఎకరాల భూమి సేకరించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్, భూసేకరణ విభాగం పర్యవేక్షకులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన డిగ్రీ 5వ , 6వ సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలను గురువారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు విడుదల చేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సీఈ ఎ. శివప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు నవంబర్ 2వ తేదీలోగా రీవాల్యుయేషన్, జవాబు పత్రాన్ని పర్సనల్ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

న్యూస్‌రీల్

అంజన్నకు లక్ష తమలపాకుల అర్చన



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారికి గురువారం పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకులతో పూజ వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం నుంచి స్వామి వారికి సుప్రభాత సేవ, గోపూజ, బిందెతీర్థం, అభిషేకం చేశారు. అనంతరం దేవస్థాన పండితులు, అర్చకులు లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహా నివేదన, పంచహారతులు చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దేశానికి గొప్ప కావ్యాన్ని అందించిన వాల్మీకి



బాపట్ల: సంస్కృతంలో రామాయణాన్ని రచించి దేశానికి అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వాల్మీకి జయంతి కార్యక్రమం గురువారం కలెక్టరేట్లో జరిగింది. మహర్షి చిత్రపటానికి ఆయన పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా ఉన్నారు. ఈ సందర్భంగా ప్రఖర్ జైన్ మాట్లాడుతూ.. దేశంలోనే సంస్కృతంలో పద్యాలు రాసిన తొలి కవిగా వాల్మీకి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని గుర్తు చేశారు. వేటగాడైన వాల్మీకి మహా ఋుషిగా మారిన తీరు ఆదర్శనీయం అని వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారిణి శివలీల, సీపీఓ శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఖాయం

పిడుగురాళ్ల: ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 29వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని పల్నాడు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిబాబా రాజు అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదన్నారు. ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ) పథకాన్ని ఇన్సూరెన్స్ విధానంలోకి మార్పు చేసినా పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బందికి న్యాయం జరగడం లేదన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో జ్యోతి వర్మకు పతకం



మంగళగిరి: గోవాలో జరుగుతున్న నేషనల్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మాస్టర్స్ మెన్ , ఉమెన్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరుకు చెందిన పవర్ లిఫ్టర్ పి. జ్యోతి వర్మ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు గురువారం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరరావు, సంధాని తెలిపారు. పవర్ లిఫ్టింగ్‌లో నేషనల్ స్థాయిలో మాస్టర్ 2ప్లస్ 50 ఇయర్స్ విభాగంలో ఈ ఘనత సాధించిన తొలి పవర్ లిఫ్టర్ జ్యోతి వర్మని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంట వెంకటేశ్వరరావు, కార్యదర్శి సకల సూర్యనారాయణతో పాటు ప్రతినిధులు అభినందించినట్లు తెలిపారు.

నృసింహ స్వామికి రూ. 45.51లక్షల ఆదాయం



మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామికి రూ.45,51,136 ఆదాయం లభించిందని ఈవో ఏ. రామకోటిరెడ్డి తెలిపారు. స్వామి దిగువ సన్నిధి, ఎగువ సన్నిధిలతో పాటు ఘాట్ రోడ్డుపై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించినట్లు పేర్కొన్నారు. ఎగువ సన్నిధిలో రూ. 18,90,274, దిగువ సన్నిధిలో రూ. 25,30,803, వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ. 85,800తో పాటు అన్నదానానికి రూ. 44,259 సమకూరినట్లు తెలిపారు.గత మూడు నెలల కంటే ప్రస్తుతం రూ. 29,259 అదనంగా వచ్చినట్లు చెప్పారు.





క్రీడా సంబరం

ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్(ఏపీఏఏ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పలు అథ్లెటిక్స్ అంశాల్లో క్రీడాకారులు పోటీ పడ్డారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. మరి కొంత మంది ఏపీ అథ్లెట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు.

బదిలీ ఆర్డరున్నా బేఖాతర్!

గత నెల 22న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను బదిలీ చేస్తూ కలెక్టర్ ఆమోదముద్రతో వచ్చిన రిలీవ్ ఆర్డర్లను మండల అధికారులు అధికారులు పట్టించుకోవడం లేదు. రాజకీయ పార్టీ ముఖ్య నేత, ఆయన పీఏ ఆమోదం ఉంటేనే విధుల్లోకి తీసుకుంటామని వారు చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఎంపీడీవో కార్యాలయం చుట్టూ ఉద్యోగులు ప్రదక్షిణలు చేస్తున్నారు సచివాలయాల ఉద్యోగులు.



చీరాల ఎంపీడీవో కార్యాలయం

చీరాల టౌన్: చీరాల నియోజకవర్గంలోని చీరాల మండలంలో 22, వేటపాలెం మండలంలో 18 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో వెల్ఫేర్ అసిస్టెంట్లు 15, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు 15, డిజిటల్ అసిస్టెంట్లు 15 మందికి గత నెల 22న జిల్లా కలెక్టర్ బదిలీ ఉత్తర్వులు అందించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో గ్రామ సచివాలయాల ఉద్యోగులను రిలీవ్ ఆర్డర్లు, జాయినింగ్ ఆర్డర్లతో ఈ నెల 4వ తేదీ నుంచి మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ ఉద్యోగులు తిరుగుతున్నారు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ ఆర్డర్ వచ్చిన 15 రోజుల్లోగా విధుల్లో చేరాలి. అదే ప్రమోషన్ వచ్చిన ఉద్యోగి అయితే 30 రోజుల్లోగా విధుల్లో చేరి తన సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయించుకోవాలి. చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో మాత్రం బదిలీ అయిన 45 మంది సచివాలయాల ఉద్యోగులకు ఆర్డర్ వచ్చి నెల సమీపిస్తున్నా విధుల్లో చేర్చుకోలేదు. పరిపాలన విషయాలు, ఉద్యోగుల బదిలీలు వంటి పనుల్లో ఆయన పీఏ తీరుపై పలువురు ఉద్యోగులు, మండల అధికారులు, కూటమిలోని నేతలు సైతం ఆందోళన చెందుతున్నారు. మండల పరిషత్ అధికారులు కూడా మోకాలొడ్డుతూ స్వామి భక్తిని చాటుకుంటున్నారు. మండల స్థాయి అధికారికి జిల్లా కలెక్టర్ బదిలీల ఉత్తర్వుల కంటే ముఖ్య నేత రిఫరెన్స్, ఆయన వ్యక్తిగత కార్యదర్శి అనుమతి ముఖ్యమైంది.


నాలుగు రోజుల్లో చేర్చుకుంటాం

సచివాలయాల ఉద్యోగుల బదిలీలు, జాయినింగ్‌ల విషయంలో కొంత కాలయాపన జరిగిన మాట వాస్తవమే. కొన్ని అవాంతరాలు ఇప్పుడే సర్దుకుంటున్నాయి. నాలుగు రోజుల్లో బదిలీ అయిన ఉద్యోగులందర్నీ విధుల్లోకి చేర్చుకుంటాం.

–శివసుబ్రమణ్యం, ఎంపీడీవో, చీరాల

ఆలపాటికి ఆమోదం ఏదీ!

- స్వయంప్రకటిత అభ్యర్థిత్వం చెల్లుబాటయ్యేనా?
- పార్టీ అనుమతి లేని సమావేశాలు కుదరవన్న నేతలు
- కూటమితో సంప్రదింపులు లేకుండానే అభ్యర్థి ఎలా?
- నివేదికల తరువాతే ఖరారంటూ టీడీపీ బుజ్జగింపు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై కూటమిలో తకరారు
- అన్నింటా వారేనా అంటున్న ఇతర సామాజిక వర్గాలు



సాక్షి, విజయవాడ: ముందడుగు మనదైతే అధిష్టానం ముందరి కాళ్లకు బంధం వేయవచ్చన్న వ్యూహంతో ఆలపాటి రాజేంద్రప్రసాద్ వేస్తున్న అడుగులు ఆయన రాజకీయానికి చేటు తెచ్చేలా ఉన్నాయి. ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు... అన్న చందాన ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని తానేనంటూ చేసుకుంటున్న స్వీయ ప్రచారాన్ని కూటమి వర్గాలు తప్పుపడుతున్నాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆలపాటి తీరును కూటమి పక్షాల సంగతి అటుంచి స్వపక్షంలోని సీనియర్లతో సహా ఆ పార్టీకి చెందిన విభిన్న సామాజికవర్గాల వారు అంతర్గతంగా వ్యతిరేకిస్తున్నారు. స్వయంప్రకటిత అభ్యర్థిత్వం చెల్లుబాటు కాదని, పార్టీ ముఖ్య నాయకులు, నిఘా వర్గాల సమాచారాన్ని సమీక్షించుకున్న తరువాతే అభ్యర్థి ఎవరనే స్పష్టత వస్తుందని టీడీపీ అధిష్టానం కూటమిలోని జనసేన, బీజేపీ ముఖ్యులకు సమాచారం పంపిందని వినికిడి. గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అయిన ఆలపాటికి గత ఎన్నికల్లో తెనాలి నుంచి టీడీపీ టిక్కెట్టు దక్కకపోవడంతో ఏదో ఒక ముఖ్య పదవి ఆశిస్తున్న నేపథ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అవకాశంగా అనిపించింది. పార్టీ పనిలో భాగంగా పట్టభద్రుల ఓటర్ల చేరిక తదితరాలను చూడాలని అధిష్టానం సూచించిందని, తననే అభ్యర్థిగా పోటీలో నిలుపుతారనే ప్రచారాన్ని ఆలపాటి చేసుకుంటున్నారని, అంతకుమించి అధిష్టానం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా, సూచనలు చేయలేదని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల సీనియర్లు గుర్తు చేస్తున్నారు. అధిష్టానం చెప్పకుండా ఆయన కోసం తాము నియోజకవర్గ స్థాయి సమావేశాలు ఎలా నిర్వహిస్తామని ప్రస్తుత గుంటూరు జిల్లాలోని ఓ శాసనసభ్యుడు ప్రశ్నించడంతో ఆలపాటి వర్గీయులు వెనుతిరిగారనేది సమాచారం. ప్రస్తుత గుంటూరు జిల్లా నుంచి ఒకే సామాజిక వర్గానికి చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పెమ్మసాని చంద్రశేఖర్, నారా లోకేష్, నాదెండ్ల మనోహర్‌లు ఉండగా మళ్లీ అదే సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీకి ఎలా నిలుపుతారని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన నాయకులు అభిప్రాయపడుతుండటం పరిశీలనాంశం. 'ఎలాంటి హోదా, అధికారం లేకుండానే ఆయన పెత్తనం చెలాయిస్తున్నారు. అధికారుల పోస్టింగ్‌లు తనకు అనుకూలంగా ఉండాలని గట్టి పైరవీలు చేశారు. పోలీసులు, మునిసిపల్ అధికారులకు హుకుం జారీ చేస్తూ పనులు చేయాలని ఒత్తిళ్లు చేస్తున్నారు. అలాంటి ఆయనకు పదవి కూడా సమకూరితే నియోజకవర్గంలో మేమేం చేయాలి' అని కూటమిలోని ముఖ్య నేత వద్ద ఓ ప్రజాప్రతినిధి ప్రస్తావించినట్లు తెలిసింది. ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం గురించి సంప్రదించారా, అలాంటివి ఏమీ లేకుండానే నిర్ణయం జరిగిపోయినట్లు ప్రచారం ఎలా చేసుకుంటారని కూడా అడిగారనేది సమాచారం.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలని ఆశిస్తున్న వారి సంఖ్య కూటమి పార్టీల నుంచి ఎక్కువగానే ఉంది. ఎవరంతట వారు ప్రయత్నాలు అంతర్గతంగా చేసుకుంటున్నారని తెలిసింది. కాగా ఆలపాటి అన్ని మార్గాల్లోనూ ప్రచారం వేగవంతం చేస్తుండటాన్ని టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి కట్టడి చేయాలని, లేదా ఏదో ఒక స్పష్టత ఇవ్వాలని కూటమి నేతలు కోరనున్నట్లు తెలిసింది.

ఆలపాటికి సహకారం అనుమానమే..

ఆలపాటిని రాజకీయంగా బాహాటంగా వ్యతిరేకించే సీనియర్లు ఉమ్మడి గుంటూరులో పెద్దసంఖ్యలోనే ఉన్నారు. ఇరుగుపొరుగు నియోజకవర్గాలలో జోక్యం చేసుకుంటూ ఇబ్బందులు పెడుతుంటారనే ఆరోపణలు ఆలపాటిపై లేకపోలేదు. తెనాలి సీటు ఇవ్వలేని పక్షంలో తనకు మరోచోట అయినా ఇవ్వాలంటూ ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలోని నియోజకవర్గాలపై ఆయన దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఆయా నియోజకవర్గాలకు చెందిన వారు ఆలపాటికి రేపటి ఎన్నికల్లో సహకరిస్తారా అనే అనుమానాలు కూడా అధిష్టానంలో ఉన్నాయని గుంటూరు జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు అభిప్రాయపడటం పరిశీలనాంశం. 'మా బాబు గారి సంగతి తెలియంది ఏముంది. ముందుగా ప్రచారానికి ఒక రాయి విసురుతారు. తను ఇవ్వాలనుకుంటే ఇస్తారు. లేదంటే నీపై వ్యతిరేకత తీవ్రంగా ఉంది. నివేదికలు భిన్నంగా ఉన్నాయి కుదరదు అంటారు' అని ముక్తాయించారు.

ఏఎన్‌యూ పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి. బ్రహ్మజీరావు తెలిపారు. ఏపీపీజీసెట్– 2024లో ర్యాంకులు పొందిన వారు ఈ ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 21వ తేదీ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రవేశాలు పొందే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో అడ్మిషన్ల కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.



క్లుప్తంగా

వాల్మీకి జీవితం ఆదర్శనీయం

ఎస్పీ తుషార్ డూడీ



బాపట్లటౌన్: వాల్మీకి మహర్షి జీవితాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. వాల్మీకి మహర్షి జయంతిను పురస్కరించుకుని గురువారం ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహాకావ్యాన్ని సంకలనం చేసిన మహనీయులు వాల్మీకి మహర్షి అన్నారు. ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే రామాయణ మధుర కావ్యాన్ని యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా సమాజానికి అందించారన్నారు. మొదటిసారిగా సంస్కృతంలో శ్లోకాలను రచించినందున వాల్మీకి మహర్షికి ఆది కవిగా, రామాయణానికి ఆది కావ్యంగా పేరు వచ్చిందన్నారు. రామాయణ మహాగ్రంథం ద్వారా మానవ కుటుంబ సంబంధాలను సమాజానికి తెలియజేశారన్నారు. మనిషిలో మార్పు వస్తే మహర్షి కాగలరని నిరూపించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. రామాయణం స్ఫూర్తితో కుటుంబ, మానవతా విలువలను పెంపొందించుకొని ధర్మబద్ధంగా జీవించాలన్నా రు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఎస్‌బి సీఐ నారాయణ, అడ్మిన్ ఆర్‌ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్‌ఐ శ్రీనివాసరెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

- అంతా బాబు ఆదేశాల పుణ్యమే
- అడ్డుకున్న కొల్లూరు పోలీసులు



కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి వద్ద ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

కొల్లూరు: అక్రమంగా ఇసుక తవ్వకాలపై కఠినంగా వ్యవహరించాలన్న కూటమి ప్రభుత్వ ఉత్తర్వులు ఓ వైపు, సొంత అవసరాలకు ఇసుకను ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లలో తరలించుకోవడానికి ఎటువంటి ఆంక్షలు ఉండవన్న సీఎం చంద్రబాబు ఆదేశాలు మరో వైపు వెలువడటంతో ఇసుక అక్రమాలను అరికట్టడం అధికార యంత్రాంగానికి తలకు మించిన భారంగా పరిణమించింది. మంత్రి వర్గ సమావేశంలో ఉచిత ఇసుక విధానంపై బుధవారం చర్చించిన అనంతరం సీఎం చేసిన వ్యాఖ్యలను ప్రామాణికంగా తీసుకున్న ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తొలుత ట్రాక్టర్ల ద్వారా కృష్ణా నదిలో ఇసుక రవాణా చేసుకోవడానికి ఎటువంటి అడ్డంకులు లేవని మౌఖికంగా తెలపడంతో గురువారం ఉదయం నుంచి ట్రాక్టర్ల యజమానులు కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టారు. అందుకు అనుగుణంగా ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి కరకట్టపై ఏర్పాటు చేసిన బృందాలు సైతం ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అడ్డుకోకుండా మౌనం వహించడంతో బాపట్ల జిల్లా పెసర్లంక, గాజుల్లంక ప్రాంతాలలోని కృష్ణా నదిలో భారీ సంఖ్యలో ట్రాక్టర్లు నదిలోకి ప్రవేశించి పోటాపోటీగా ఇసుక తరలింపు చేపట్టారు. ఈ పరిస్థితుల్లో రేపల్లె, తెనాలి, చెరుకుపల్లి, భట్టిప్రోలు, అమృతలూరు, వేమూరు, చుండూరు, తదితర ప్రాంతాలకు ఇసుక తరలించి సొమ్ము చేసుకునే పనిలో ఇసుక రవాణాదారులు మునిగి తేలారు.

నదిలో ఇసుక తరలింపు అక్రమమే

ఇసుక అధిక సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా దూర ప్రాంతాలకు తరలిస్తున్న సమయంలో కళ్లు తెరిచిన పోలీసు యంత్రాంగం నదిలో ఇసుక తరలింపు అక్రమమేనని అడ్డుకోవడం వివాదాస్పదమైంది. కొల్లూరు ఎస్‌ఐ జి. ఏడుకొండలు సిబ్బందితో కలసి పెసర్లంక, గాజుల్లంక నదీ ప్రాంతానికి వెళ్లి ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని, ఇసుక నింపిన ట్రాక్టర్లు సైతం నదిలోనే అన్‌లోడ్ చేసి వెళ్లాలని ఆదేశించడంతో సీఎం ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపుకు ఆంక్షలు లేవని ప్రకటించినా పోలీసులు అపడంపై ఇసుక రవాణాదారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పోలీసులు నది నుంచి ఇసుక తరలింపు సాధ్యపడదని బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఇసుక రవాణాదారులు టీడీపీ నాయకులను ఆశ్రయించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు గీతికశ్రీ

21 నుంచి 23వ తేదీ వరకు హిందూపురంలో వాలీబాల్ పోటీలు



భట్టిప్రోలు: సత్యసాయి జిల్లా ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు హిందూపురంలో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న బొర్రా గీతికశ్రీ ఎంపికైంది. గురువారం వేజండ్ల హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపికలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరపున గీతికశ్రీ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కూచిభొట్ల శ్రీనివాస శర్మ తెలిపారు. ఎంపికైన గీతికశ్రీ, శిక్షణ ఇచ్చిన పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావులను హైస్కూల్ పాలక వర్గ అధ్యక్షులు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకట కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

భారీగా మద్యం సీసాలు ధ్వంసం

బాపట్లటౌన్: పట్టణంలో గతంలో అక్రమ మద్యం తరలింపులో భాగంగా నమోదైన 49 కేసుల్లోని 1000 మద్యం బాటిళ్ళను గురువారం పట్టణ పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ జి. రామాంజనేయులు ఆధ్వర్యంలో పట్టణంలోని డంపింగ్ యార్డు ప్రాంతంలో ధ్వంసం చేశారు. అక్రమంగా మద్యం తరలించినా, బెల్ట్‌షాపులు నిర్వహించినా అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ అహ్మద్‌జానీ, ఎస్‌ఐ విజయ్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మద్యం సీసాలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

మద్యం దుకాణం వద్దే వద్దు

- మద్యం షాపు తొలగించాలంటూ మహిళలు, స్థానికులు ఆందోళన
- రెండు గంటల పాటు నిలిచిన ట్రాఫిక్
- పోలీసుల చొరవతో షాపు మూసివేత

చీరాల అర్బన్: నివాస గృహాలు, పాఠశాల సమీపంలో మద్యం షాపులు ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ గురువారం సాయంత్రం చీరాలలోని గొల్లపాలెంలో మహిళలు, స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. నివాస గృహాల వద్ద మద్యం షాపు ఏర్పాటు చేస్తే ఇబ్బందికరమని, వెంటనే షాపును ఆ ప్రాంతం నుంచి తీసివేయాలంటూ వాపోయారు. చీరాల గొల్లపాలెంలో భాష్యం స్కూల్ వద్ద మద్యం షాపును గురువారం ప్రారంభించారు. చీరాల నుంచి రామాపురం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో పాటు నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేశారు. అలానే నివాస గృహాలు, పాఠశాలలు కూడా ఉండడంతో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బుధవారం మద్యం షాపు ఏర్పాటు చేయాలని ప్రయత్నించగా స్థానికులు వ్యతిరేకించడంతో గురువారం ప్రారంభించారు. మద్యం షాపు ఏర్పాటు చేయడంతో స్థానికులు, మహిళలు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేశారు. రెండు గంటల పాటు రోడ్డుపై ప్రజలు ఆందోళన చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పాఠశాలకు సమీపంలో మద్యం షాపు ఉండవద్దని, నివాస గృహాలు కూడా దగ్గరగా ఉండడంతో మద్యం షాపును తొలగించాలని డిమాండ్ చేశారు. రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. మద్యం షాపును అక్కడి నుంచి తొలగించే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చి చెప్పారు. దీంతో చేసేది లేక పోలీసులు మద్యం షాపును మూసివేయడంతో ఆందోళన విరమించారు.



మద్యం షాపు తొలగించాలంటూ రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు



ఆందోళన కారణంగా నిలిచిన ట్రాఫిక్

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

చీరాల: పట్టణంలోని విఠల్‌నగర్‌లో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి గురువారం హల్‌చల్ చేశారు. అర్ధనగ్నంగా ఓ యువకుడు మిద్దెల పైకి ఎక్కి అర్థం కాని భాషలో అరుపులు, కేకలు వేస్తూ వీరంగం సృష్టించాడు. దీంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతడిని బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మతిస్థిమితం లేకపోవడంతో అలా ప్రవర్తించినట్లు పోలీసులు తెలిపారు. కొంత సమయం పాటు అతడు చేసిన వీరంగానికి అందరూ హడలెత్తిపోయారు.



మతిస్థిమితం లేని వ్యక్తిని తీసుకెళ్తున్న పోలీసులు

మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి

- సంఘాలకు బ్యాంకర్లు రుణాలివ్వాలి
- డీఆర్‌డీఏ పీడీ పద్మజ

చీరాల టౌన్: మహిళల ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు పూర్తి సహకారం అందించి విరివిగా రుణాలు ఇచ్చి ఆర్థిక చేయూతనందించాలని జిల్లా డీఆర్‌డీఏ పీడీ పద్మజ బ్యాంకర్లకు సూచించారు. గురువారం చీరాల ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ హాలులో భారతీయ స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. చీరాల ఐకేపీ ఏపీఎం మధు ఆధ్వర్యంలో జరిగిన బ్యాంకర్ల సమావేశానికి హాజరైన పీడీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళలు అన్నీ రంగాల్లో రాణిస్తున్నారని, చిన్న, స్వల్ప పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధితో పాటుగా కుటుంబ పోషణకు, ఆర్థిక చేయూతనందిస్తున్న మహిళా పొదుపు సంఘాలకు బ్యాంకర్లు రుణాలివ్వాలన్నారు. ఆర్థిక సంవత్సరాలకు ఉన్న టార్గెట్లకు అదనంగా మహిళలకు రుణాలిచ్చి ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. జిల్లా పరిధిలోని 13 మండలాల్లోని పొదుపు మహిళలకు గ్రూపునకు, సభ్యురాలికి కూడా రుణాలివ్వడం వలన వ్యాపారాల్లో రాణిస్తారన్నారు. మహిళలు లక్షాధికారులుగా తయారు చేయాలంటే బ్యాంకర్లు తమవంతుగా రుణాలిచ్చి ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఎస్‌బీఐ బ్యాంకు ఒంగోలు, తెనాలి రీజనల్ మేనేజర్లు గున్నేశ్వరరావు, జగదీష్‌లు మాట్లాడుతూ ఎస్‌బీఐ పొదుపు మహిళలకు అండగా ఉంటుందని, రుణాలు తీసుకున్న వారు రికవరీ వాయిదాలు సక్రమంగా చెల్లిస్తే అదనంగా రుణాలు అందించేందుకు కూడా సహకరిస్తామన్నారు. సమావేశంలో పలు బ్రాంచ్‌ల మేనేజర్లు, ఏరియా కోఆర్డినేటర్లు, ఏపీఎంలు, సిబ్బంది ఉన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పద్మజ

పంచాయతీల బలోపేతమే లక్ష్యం

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి: పంచాయతీలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం మండలంలోని మోదేపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూ.30 లక్షల అంచనా వ్యయంతో సుమారు 800 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ శంకుస్థాపన చేశారు. అద్దంకి నియోజకవర్గంలో రూ.40 కోట్ల పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. తిమ్మాయపాలెం నుంచి ఇలపావులూరు వరకు రోడ్డు మరమ్మతులకు రూ.70 లక్షలు మంజూరు చేశామన్నారు. దీపావళి నుంచి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలని, ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని చెప్పారు. పట్టాదారు పాసుపుస్తకంపై రాజముద్ర వేసి ఇస్తామని చెప్పిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోండి

డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు

వేటపాలెం: పదోతరగతి చదివే విద్యార్థులు గత ఏడాది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని చదువుల్లో రాణించాలని డిప్యూటీ డీఈఓ అబ్బరాజు శ్రీనివాసరావు పేర్కొ న్నారు. అక్కాయి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో గత ఏడాది పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు దాతలు సమకూర్చిన నగదు బహుమతులు గురువారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీప్యూటీ డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించడానికి పాఠశాల్లో చదివిన పూర్వ విద్యార్థి చేబ్రోలు శేఖర్‌బాబు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారని తెలిపారు. 470 మార్కులు సాధించిన పి. అనూరాధకు రూ.8 వేలు, 466 మార్కులు సాధించిన జె.మహేష్‌కు రూ. 6 వేలు, 462 మార్కులు సాధించిన వి.మీనాక్షికి రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతులతో పాటు మెమెంటోలు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతం కావాలంటే మనబడి అనే ఫీలింగ్ ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. దాత 35 ఏళ్ల కిందట ఈ స్కూల్‌లోనే చదువుకున్నాడని గుర్తుచేశారు. తమ స్కూల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రతిభ కల్గిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధీర్, కల్పన, శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసరెడ్డి, అనురాధ, అంజమ్మ, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నిసా బేగం, శివకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో దాత, ఉపాధ్యాయులు

దూరవిద్య ప్రవేశాలకు 25తో ముగుస్తున్న గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి దూరవిద్య టెన్త్, ఇంటర్‌లో ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశం పొందేందుకు తుది గడువు ఈనెల 25న ముగియనుందని సంస్థ డైరెక్టర్ కె. నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు రూ.200, 30, 31వ తేదీల్లో రూ.500 అపరాధ రుసుంతో ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన సూచించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు సమీపంలోని ఏపీఓఎస్ఎస్ అధ్యయన కేంద్రాలతో పాటు ఏపీఓఎస్ఎస్ సైట్ సందర్శించాలని తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

అచ్చంపేట: కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొండూరులో గురువారం చోటుచేసుకుంది. మృతుని భార్య కేటావతు అంజమ్మభాయ్ అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు ఇలా ఉంది.. పల్నాడు జిల్లా కొండూరు గ్రామానికి చెందిన కేతావతు వెంకటేశ్వర్లునాయక్(44) బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం నుంచి వెతకడం ప్రారంభించారు. పొలంలోకి వెళ్లి చూడగా చనిపోయి ఉండడాన్ని గమనించారు. పక్కనే పురుగుమందు బాటిల్ ఉండగా, పురుగుమందు తాగి మృతి చెందినట్లుగా పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా పంటలు సక్రమంగా పండటం లేదన్నారు. తమకున్న సొంత పొలం రెండెకరాలతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి వేశారు. ఈ యేడాది కూడా పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని, పెట్టుబడులు భారీగా పెరిగిపోవడంతో అప్పులవాళ్లకు సమాధానం చెప్పలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్యాంకులలో, ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో, తెలిసినవాళ్ల వద్ద చేబదులుగా తీసుకున్న అప్పులు రూ.12 లక్షలకు పైగా ఉన్నట్లు తెలిపారు. మృతినికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఘటనపై అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

బంగారు ఆభరణాలు మాయం

నరసరావుపేట టౌన్: మహిళా బ్యాగులో బంగారు ఆభరణాలు అపహరణకు గురైన సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ గురువారం సాయంత్రం తెలిపారు. గుంటూరుకు చెందిన పొనుగోటి సంజన శ్రీలక్ష్మి దసరా పండుగ రోజు రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామంలోని అత్తగారి ఇంటికి వచ్చింది. రెండు రోజుల క్రితం పట్టణంలోని బృందావనం జ్యువెలర్స్ వద్దకు వచ్చి తనవద్ద ఉన్న పాత వెండి వస్తువులను మార్చి కొత్తవి తీసుకుంది. వాటితోపాటు తన వద్ద ఉన్న బంగారు వస్తువులు బ్యాగులో భద్రపరుచుకుంది. అక్కడి నుంచి బట్టలషాపు వద్దకు వెళ్లి చూడగా బ్యాగులో బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు.

అదృశ్యమైంది... క్షేమంగా ఇంటికి చేరింది!

చందోలు(కర్లపాలెం): ఇటీవల అదృశ్యమైన బాలికను గుర్తించి ఆమె తల్లిదండ్రులకు అప్పగించామని చందోలు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు భవనంవారిపాలెం గ్రామానికి చెందిన అంత్యాల మరియమ్మ తన కుమార్తె కనిపించటం లేదని ఈనెల 15 తేదీన ఫిర్యాదు ఇచ్చిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి బాలికను చీరాలలో ఉన్నట్లు గుర్తించి ఆమెను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు చెప్పారు.

ముగిసిన అండర్-15 చెస్ పోటీలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): మూడు రోజుల నుంచి రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక నెక్స్‌జెన్ స్కూల్లో జరుగుతున్న లీలావతి మెమోరియల్ ఏపీ అండర్–15 బాల బాలికల రాష్ట్రస్థాయి చెస్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకుడు వై.వి.కె. చక్రవర్తి మాట్లాడుతూ బాలురల్లో ఎస్.వై.ఎస్. గంగాధర్, కె.భవన్, ఎం.వి. రుత్విక్, కె.సీతాసాగర్, బాలికల్లో వి.త్రిపురాంతిక, ఏ.ఎస్.ఎస్.ఎస్. దివ్య, జి.హిమతేజస్విని, ఎస్.రిషితలు వరుస స్థానాలు గెలుపొందారని తెలిపారు. వీరందరీనీ త్వరలో జరగనున్న జాతీయ పోటీలకు పంపిస్తామని చెప్పారు. విజేతలకు ఏపీ చెస్ అసోసియేషన్ చైర్మన్ కె.వి.వి శర్మ, నిర్వహణ కార్యదర్శి ఫణికుమార్, సంయుక్త కార్యదర్శి రాజీవ్ బహుమతులు అందజేశారు.

మాస్టర్‌మైండ్స్ విద్యార్థినికి సీఎం అభినందనలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆగస్టు–2024 సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థిని కొత్తపేట తేజస్వినిని సీఎం నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసినట్లు మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు సీఏ, సీఎంఏ కోర్సుల్లో అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులు సాధిస్తుండటంపై యాజమాన్యంతో పాటు అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారని పేర్కొన్నారు. ఈసందర్భంగా విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.7 లక్షల డీడీని అందజేసినట్లు తెలిపారు.



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తేజస్విని, పక్కన మట్టుపల్లి మోహన్

కేబుల్ వర్కర్ మృతి

కారెంపూడి: విద్యుత్‌షాక్‌కు గురై కేబుల్ వర్కర్ మృతి చెందిన ఘటన మండలంలోని బట్టువారిపల్లె గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. దాచేపల్లి గ్రామానికి చెందిన జాలె నాగేశ్వరరావు బట్టువారిపల్లె గ్రామంలో కేబుల్ లైన్‌లాగే క్రమంలో కరెంటు స్తంభాలకు కేబుల్ వైరు కడుతుండగా ప్రమాదం జరిగింది. నిచ్చెన వేసుకుని కేబుల్ వైరును కరెంటు స్తంభానికి కడుతుండగా నిచ్చెనకు తడిఉండడం వల్ల అది విద్యుత్తు తీగలకు తగలడంతో విద్యుత్ ప్రసారం జరిగి మొదట షాక్‌కు గురై ఆ తర్వాత పక్కనే సప్లయ్ ఉన్న ఎల్‌టీ లైన్‌పై పడి విద్యుత్‌షాక్‌కు గురై కిందపడిపోయాడని తెలుస్తోంది. వెంటనే పెదకొదమగుండ్లలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే నాగేశ్వరరావు (40)మృతి చెందాడని డాక్టర్ తెలిపారు.